1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఆగస్టు 03, 2024 | www.navatelangana.com

డ్రగ్స్, గంజాయి మత్తుతో.. జీవితాలు నాశనం

- రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ డిఎస్‌పి సోమనాథం


మాట్లాడుతున్న డిఎస్‌పి

నవతెలంగాణ-గాంధారి

యువత డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తే వారి నిండు జీవితం, బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ డి ఎస్ పి సోమనాథం తెలిపారు. గాంధారి మండల కేంద్రంలో ఏకలవ్య కళాశాలలో శుక్రవారం సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. యువత పెడదారిన పట్టకుండా డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు వాడకుండా భావి జీవితాన్ని మార్గ నిర్దేశనం చేస్తూ స్థానిక ఏకలవ్య మోడల్ స్కూల్ నందు అవగహన కల్పించారు. నేర రహిత సమాజం కోసం అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సిఐ సంతోష్ ,గాంధారి ఎస్.ఐ ఆంజనేయులు ,కళాశాల ప్రిన్సిపాల్ సవితాజైన్ మరియు విద్యార్థులు, యువత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికపై 40 ఏళ్ల యువకుడి లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

అభం శుభం తెలియని ఐదేండ్ల చిన్నారిపై 40 ఏండ్ల వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన దారుణ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాము వివరాల ప్రకారం.. బడాబజార్‌కు సమీపంలో గల ఓ గల్లీలో ఐదున్నర ఏళ్ల చిన్నారి పై అదే కాలనీలో నివాసం ఉంటున్న 40 ఏళ్ల ఓ మేకల కాపరి వీధిలో ఆట ఆడుకుంటున్న చిన్నారి కి చాక్లెట్ ఆశ చూపి లైంగికదాడికి పాల్పడ్డాడు. గురువారం చిన్నారి కడుపునొప్పి ఉందని తెలప˝డంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం లైంగికదాడి జరిగినట్లు నిర్ధారించారు. వెంటనే కుటుంబ సభ్యులు రెండవ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చిన్నారి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసును నమోదు చేసినట్లు రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాము తెలిపారు.


బ్యాంకు ముందు బైటాయించిన రైతులు

అర్హులమైనా రుణమాఫీ కాలే

- రెంజల్‌లో కెనరా బ్యాంక్ ఎదుట రైతుల బైటాయింపు
- మాక్లూర్‌లో సొసైటీ ఎదుట రైతుల ధర్నా

నవతెలంగాణ-రెంజల్/మాక్లూర్

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ రుణమాఫీ చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ కెనరా బ్యాంకుల అధికారుల తప్పిదం వల్ల తమకు రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఎదుట రైతులు శుక్రవారం బైటాయించారు. మాక్లూర్ మండల క్రేంద్రలోని సొటీలుగా రైతులు ఆందోళన చేపట్టారు. రైతులు సకాలంలో రుణాలు తీసుకొని రైతు రుణమాఫి అర్హులైనప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు రుణమాఫి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వివరాలు మెయిన్‌లో..


మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

పెండింగ్ బిల్లుల కోసం
మాజీ సర్పంచ్‌ల చలో అసెంబ్లీ

- పలువురి ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-లింగంపేట్

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు పోరుబాట పట్టారు. చలో అసెంబ్లీ తలపెట్టగా.. జిల్లా వ్యాప్తంగా పలువురు మాజీ సర్పంచ్‌లను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

పెండింగ్ బిల్లుల కోసం చలో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న సర్పంచులను గృహ నిర్బంధం చేసి పోలీస్ ఠాణాకు తరలించినట్టు మాజీ సర్పంచుల ఫోరమ్ ప్రధాన కార్యదర్శి శెట్పల్లి సంగారెడ్డి మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వతంత్రంగా పోటీ చేసి గెలిచిన గ్రామ అభివృద్ధి కోసం అధికార పార్టీతో కలిసి పనిచేసి గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపించిన సర్పంచులను గత ప్రభుత్వం పెద్దకాందార్ లాగా చూసిందని, గ్రామ పంచాయతీలకు సరిగా బిల్లులు రాకపోవడంతో అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని మాజీ సర్పంచులు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఐలాపూర్ మాజీ సర్పంచ్ ధనలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, సజ్జనపల్లి మాజీ సర్పంచ్ పుట్టి పోచయ్య, బాణాపూర్ మాజీ సర్పంచ్ బండి కవిత నర్సింలు, లింగంపేట్ మాజీ సర్పంచ్ బొల్లు లావణ్య తదితరులు ముందుస్తు తెలిపారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

జుక్కల్ మండలంలోని పెద్దఎడ్గి, గుండూర్ గ్రామాల మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కొత్త ప్రభుత్వానికి తమ సమస్యలు తెలుసని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సర్దుబాటు చేస్తామని పలు మార్లు చెప్పినా నేటికి నిధులు విడుదల కాక తెచ్చిన డబ్బులకు వడ్డీ కట్ట లేక ఆస్తులను అమ్ముకొని రోడ్డుమీదకు వచ్చినట్టు తెలిపారు. మాజీ సర్పంచులు పెద్ద ఎడ్గి అస్పత్ వార్ వినోద్, గుండూర్ మెత్రి దేవిదాస్ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

'ప్రతిభ'కు ప్రోత్సాహం అందించాలి

- నియోజకవర్గ క్రీడాకారిణిపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండలానికి చెందిన చెస్ బాక్సింగ్ క్రీడాకారిణి 'ప్రతిభ'కు ప్రోత్సాహం కల్పించాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. తెలంగాణకు చెందిన క్రీడాకారులు బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌లకు ఇచ్చిన గుర్తింపు పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా జుక్కల్ నియోజకవర్గానికి చెందిన ప్రతిభ అనే క్రీడాకారిణి వివిధ క్రీడలలో రాణిస్తున్నదని గుర్తు చేశారు. ఈమధ్య కోల్ కతాలో జరిగిన ఇండియా, ఏషియన్ చెస్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో ఐదు గోల్డ్ మెడల్స్ ఒక సిల్వర్ మెడల్ సాధించిందని, రెండు వరల్డ్ ఛాంపియన్ షిప్స్ కూడా సాధించిందని తెలిపారు.

జుక్కల్ నియోజకవర్గంలో ఒక్క స్టేడియం గానీ కనీస క్రీడా సౌకర్యాలు లేకపోయినప్పటికీ ఆమె ఇంత అద్భుతమైన ప్రతిభ కనబరుస్తుందని తెలిపారు. కాబట్టి ప్రభుత్వం తరపున ప్రతిభకు ప్రోత్సాహకం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

మొక్కల పెంపకమే
భవిష్యత్ తరాలకు ఇచ్చే గొప్ప బహుమతి

- సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మొక్కల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్పబహుమతి అని, మొక్కలు నాటి సంరక్షించుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ తెలిపారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం, నిజామాబాద్ ఆకాశవాణి నిజామాబాద్ ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణం - ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుందని, ఈ దిశగా విద్యార్థులంతా అమ్మ పేరిట ఒక మొక్క స్ఫూర్తిని వ్యాప్తి చేయటంలో భాగస్వాములు కావాలని సూచించారు.


మొక్కలు నాటుతున్న సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్

ఆకాశవాణి ట్రాన్సమిషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్ దాస్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరం కంకణబద్ధులం కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన పర్యావరణాన్ని యథావిధిగా ముందు తరాలకు అందించాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బిఎస్ మీన సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూర్ ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అసిస్టెంట్ రసిద్, సీబీసీ ఎంటిఎస్ పోచయ్య బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం అన్వేషణ

- నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్న గ్రామపంచాయతీలు
- చిన్న జీపీల ఆర్థిక పరిస్థితి మరింత అధ్వాన్నం
- నిధుల సేకరణకు ప్లాస్టిక్ అమ్ముకుంటున్న వైనం



నవతెలంగాణ-నసురుల్లాబాద్

పంచాయతీలు నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా చిన్న గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఆదాయ వనరులను సేకరించడం కోసం గ్రామపంచాయతీల కార్యదర్శులు డంపింగ్ యార్డ్‌లో దొరికే చెత్త వస్తువులను ప్లాస్టిక్ వస్తువులను విక్రయించి నిధులను సమకూర్చుకుంటున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 525 గ్రామ పంచాయతీలున్నాయి. కాగా ఈ యేడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో సర్పంచులకు బదులుగా గ్రామ ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేక అధికారులు వచ్చినప్పటి నుంచి గ్రామపంచాయతీకి ఎలాంటి నిధులు రాకపోవడంతో నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. నిధుల సమకూర్చేందుకు గత్యంతరం లేని పరిస్థితిల్లో గ్రామాల్లో చెత్త సేకరించి చెత్తలో దొరికే ప్లాస్టిక్ వస్తువులను, ఇతర వస్తువులను సేకరించి వాటిని విక్రయిస్తూ నిధులను సమకూరుస్తున్నారు. అదే విధంగా కంపోస్టు ఎరువు తయారు చేస్తూ విక్రయిస్తూ నిధులు రాబట్టేప్రయత్నాలు చేస్తున్నారు.



నసురుల్లాబాద్ మండలంలో నసురుల్లాబాద్, మిర్జాపూర్, దుర్కి కంశెట్ పల్లి, సంగెం గ్రామాల్లో తై బజార్ ద్వారా వచ్చే నిధులను గ్రామపంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో వార సంత రసీదులు గ్రామపంచాయతీ సిబ్బందితో వసూలు చేయించుకునేందుకు సిద్ధం చేస్తున్నారు. అలాగే 17 గ్రామ పంచాయితీలో చెత్త సేకరించి చెత్త ద్వారా కంపోస్ట్ ఎరువులను తయారు చేసి విక్రయిస్తున్నారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి..

గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. గ్రామాల్లో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు, ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బుల్లేని పరిస్థితి నెలకొంది. పంచాయతీ భవనాల కరెంట్ బిల్లులు కట్టడానికి కూడా నిధుల్లేవని గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడం, ఇతర ఆదాయ వనరుల్లేక పోవడంతో గ్రామాల్లో కనీస సమస్యలను కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయింది.

పాలకవర్గం ఉంటేనే నిధులు..

గ్రామ పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదలచేయక పోయినా పాలకవర్గాలు ఉన్నపుడు సర్పంచులు ఏదో విధంగా డబ్బులు సర్దుబాటు చేసి పనులు ఆగకుండా చూసే వారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ప్రత్యేక అధికారుల పాలనలో రావని, మళ్లీ పంచాయతీల పాలక వర్గాలను ఎన్నుకొన్న తర్వాతే కేంద్రం నిధులు వస్తాయని పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. దీంతో కార్యదర్శులు చేసేదిలేక ఇతర ఖర్చులకు అప్పులు చేసి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక సిబ్బంది విషయానికి వస్తే సకాలంలో వారికి వేతనాలు చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో గ్రామపంచాయతీ సిబ్బంది పాత్ర అంతా ఇంత కాదు. అస్సలే చాలీచాలని వేతనంతో గ్రామానికి సేవలు చేస్తున్న సిబ్బందికి నెల నెలా చెల్లించకపోవడం వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీలకు కొన్ని నెలలుగా విడుదలకాని గ్రాంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో వెంటనే విడుదలచేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

నిధులు లేక.. ప్లాస్టిక్ విక్రయాలు



గ్రామ పంచాయతీల్లో ఉన్న నిధులను మొదటి ప్రాధాన్యంగా జీతాలు చెల్లిస్తున్నాము. పంచాయతీల్లో జీతాల సమస్యలేదు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక కార్మికులకు వేతనాలు చెల్లించడం ఇబ్బందిగా ఉంది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నిధుల కోసం డంపింగ్ యార్డ్‌లో లభించే ప్లాస్టిక్, ఇతర వస్తువులను విక్రయిస్తూ నిధులు సమకూరుస్తున్నాం.

\- గ్రామ పంచాయతీ అధికారి రాము



'స్వచ్ఛదనం-పచ్చదనం' నిర్వహణలో
నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- అత్యవసరం అయితే తప్ప సెలవులు తీసుకోవద్దని ఆదేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈ నెల 5 నుండి 09వ తేదీ వరకు కొనసాగనున్న 'స్వచ్ఛదనం - పచ్ఛదనం' కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. ఆయా శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించా రు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఏ.పీ.ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛదనం-పచ్ఛదనంపై సమీక్ష నిర్వహించారు. ఐదు రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలు తెలియజేశారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి, ఆశా కార్యకర్త, వీ.ఓలతో కమిటీని ఏర్పాటు చేసుకుని నిర్దేశిత కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలోని ఆసక్తి గల యువతను, పాఠశాలల హెచ్.ఎంలు, మెడికల్ ఆఫీసర్లను కూడా కమిటీలో ప్రాతినిధ్యం కల్పించవచ్చని సూచించారు. తక్షణమే కమిటీలను ఏర్పాటు చేసుకుని, మండల ప్రత్యేక అధికారుల సమక్షంలో సమావేశాన్ని నిర్వహించి స్పష్టమైన కార్యాచరణను రూపొం దించుకోవాలని అన్నారు. స్వచ్ఛదనం-పచ్ఛదనం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నందున అధికారులు మొదలుకుని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచే యాలని, అత్యవసరమైతే తప్ప ఎవరూ సెలవులు పెట్టకూడదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తనతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులు ఆకస్మికంగా సందర్శించిన సమయా లలో ఎక్కడైనా నిర్వహణ పరంగా లోపాలు ఉంటే, సంబంధిత అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా పరిగణించి చర్యలు తీసుకుంటామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, జెడ్పి సీఈఓ ఉష, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ చక్రవర్తుల తరుణ్ కుమార్, డీఐఈఓ రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, తదితరులు

చించోలి అభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజకవర్గం లోని బీర్కూరు మండలం చించోలి గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర చైర్మన్ కాసుల బాలరాజు తెలిపారు. గురువారం గ్రామంలో గ్రామ దేవతల బోనాల జాతర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్ విచ్చేసి గ్రామస్తులతో బోనాలు నెత్తిమీద ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతకు పూజించారు. అనంతరం గ్రామంలో ఒకరికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. గ్రామంలో ఉన్న పలువాడలను తిరుగుతూ గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆగ్రో చైర్మన్ కాసుల మాట్లాడుతూ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో చించోలి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీర్కూర్ మండల అధ్యక్షులు బోయిని శంకర్ , కామారెడ్డి డీసీసీ డెలిగేట్ కాంత్ రెడ్డి , సొసైటీ అధ్యక్షులు కృష్ణ రెడ్డి , యమ రాములు తదితరులు పాల్గొన్నారు.

బతికిఉన్న వ్యక్తి చనిపోయినట్టు
తప్పుడు పత్రాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్

- నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-కామారెడ్డి

బతికున్న వ్యక్తి చనిపోయినట్లుగా తప్పుడు ధృవపత్రాల సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నరాల జీవన్‌రెడ్డి, అశోక్ నగర్ కాలనీ, కామారెడ్డిలో నివాసం ఉండే ఇతనికి అశోక్ నగర్లో 200 గజాల ప్లాటు కలదు. అయితే ఆ ప్లాటును జులై 26న కామారెడ్డి పట్టణానికి చెందిన మహమ్మద్ సాజిద్ హుస్సేన్ అనే వ్యక్తి ట్రాక్టర్ సహాయంతో చదును చేయడానికి తీసుకురాగా, ఆ విషయం తెలిసిన జీవన్ రెడ్డి వెంటనే అక్కడికి వెళ్లి ఆరా తీశారు. కాగా సదరు ప్లాట్‌ను వేరే వారికి అమ్మేందుకు చదును చేస్తున్నట్టు తెలిపాడు. ఈ ప్లాటు నిజామాబాద్‌కి చెందిన అబ్దుల్ మోసి అనే వ్యక్తి కొనుగోలు చేసినట్లుగా కొన్ని పత్రాలను చూపించగా, ఆ పత్రాలను చూసిన జీవన్ రెడ్డి, దానిలో జీవన్ రెడ్డి అనే వ్యక్తి 2012 లోనే చనిపోయినట్లుగా ఒక డెత్ సర్టిఫికేట్ నీ, అదే విధంగా జీవన్ రెడ్డి కూతురుగా బగ్గాలి స్రవంతి అనే ఆమెని తీసుకువచ్చి ఒక సెల్ఫ్ అఫిడవిట్ క్రియేట్ చేసి, కామారెడ్డి సబ్ రిజిస్టర్ ఆఫీసులో మహమ్మద్ అబ్దుల్ మోసి పేరుమీద రిజిస్టర్డ్ సేల్ డీడ్ చేసినారనీ గుర్తించాడు. అది గమనించిన జీవన్ రెడ్డి తనని మోసం చేస్తూ, తాను చనిపోయినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి, తన కూతురి ప్లేస్ లో వేరొక ఆమెను పెట్టి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసినారని పోలీస్ స్టేషన్ కామారెడ్డి టౌన్ నందు దరఖాస్తు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే విచారణలో అబ్దుల్ మోసి అనే వ్యక్తి, అతనితో పాటుగా నిజామాబాదులో డాక్యుమెంట్ రైటర్ గా చేస్తున్న షేక్ అహ్మద్ నబీ, షకీల్ ఫెరోజ్, ఖాజా అబ్బాస్, మహమ్మద్ ఉస్మాన్ వీరందరూ కలిసి నరాల జీవన్ రెడ్డి ప్లాటును మోసపూరితంగా, అతను చనిపోయినట్లుగా వేరే వారి యొక్క డెత్ సర్టిఫికేట్ ను మార్చివేసి, అహ్మద్ నబీకి పరిచయమున్న బగ్గాలి స్రవంతిని నరాల జీవన్ రెడ్డి కూతురుగా తీసుకువచ్చి, సబ్ రిజిస్టార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసినారని తేలింది. అంతేగాక ఆ భూమిని వేరే వాళ్లకు అమ్మడం కోసము చదును చేయడానికి కామారెడ్డికి చెందిన సాజీద్ హుస్సేన్‌కు చెప్పరాని తెలిపారు. ఈ విషయములో విచారణ చేసి, బాధ్యులైన మహమ్మద్ అబ్దుల్ మోసి, బాగ్గాలి స్రవంతి, షేక్ అహ్మద్ నబీ లను అరెస్టు చేసి జైలుకు పంపించినట్టు తెలిపారు. పరారీలో ఉన్న మిగతా వారిని కూడా పట్టుకుని, కోర్ట్ లో హాజరు పరచనున్నట్టు తెలిపారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ రీజియన్ మేనేజర్

ఆర్టీసీకి రూ.143 కోట్ల ఆదాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

'ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ పరిధిలో డిసెంబర్ 9 నుంచి జూలై 31 నాటికి 3.82 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. ఈ ప్రయాణంతో ఆర్టీసీ సంస్థకు 143. 56 కోట్ల ఆదాయం సమకూరింది. ఆర్టీసీ బస్సులలో కేవలం 68 శాతం మాత్రమే ఉన్న ఆక్యుపెన్సి ఇప్పుడు 92 శాతం దాటిందని' నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ జానీరెడ్డి తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ రీజియన్ లో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. స్కీం ప్రారంభంలో బస్సుల కొరత, జాతర సమయం కావడంతో మహిళా ప్రయాణికులకు బస్సులలో కిక్కిరిసి పోయే విధంగా ఉండే పరిస్థితి అని, ప్రస్తుతం పరిస్థితి మారిపోయాయి అని కొత్త బస్సుల బస్సుల సంఖ్య పెరగడంతో పాటు గతంతో పోలిస్తే రద్దీ తగ్గిందని తెలిపారు. కేవలం వీకెండ్స్ లలో, సెలవు దినాలలో, పండుగ సమయంలో, బస్సులలో రద్దీ కనిపిస్తుంది అని, మిగతా రోజుల్లో సాధారణ పరిస్థితి ఉంటుందని తెలిపారు. మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్ జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చని సూచించారు. శ్రావణమాస సందర్భంగా ను ప్రత్యేక బస్సు సౌకర్యాలను కల్పిస్తున్నామని, అంతేకాకుండా పెళ్లిళ్లకు, శుభకార్యాలకు అద్దె బస్సులు సౌకర్యం లభిస్తుందని వివరించారు. డిపో మేనేజర్లను సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారని సూచించారు. ఆర్మూర్ డిపో మేనేజర్ ఫోన్ నెంబర్ 9959 226019, బోధన్ డిపో మేనేజర్ 9959 226001, నిజామాబాద్ డిపో 1 మేనేజర్ 9959 2260 16, నిజామాబాద్ డిపో 2 మేనేజర్ 9959 2260 17, కామారెడ్డి డిపో మేనేజర్ 9959 2260 18, బాన్సువాడ డిపో మేనేజర్ 9959 2260 20 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

గీతన్నల చైతన్యయాత్ర పోస్టర్ అవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లాలో అమరుల యాదిలో గీతన్నల చైతన్య పోస్టర్‌ను నాందేవ్‌వాడ కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారిని గుర్తు చేస్తూ గీతన్నల చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గీతన్న చైతన్య యాత్ర 2వ తేదీ నుంచి 18వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. నిజామాబాద్ జిల్లాలో కూడా త్వరలోనే అమరుల యాదిలో గీతన్న చైతన్య యాత్రను ప్రారంభిస్తామని తెలిపారు. జరగబోయే గీతన్న చైతన్య యాత్రను జయప్రదం చేయాలని గౌడగీత సోదరులందరికీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేపుర్ సాయగౌడ్, శ్రీరామ్ గౌడ్, పుదరి రమగౌడ్, పండరి, సిడుగు శేఖర్ గౌడ్, కోయేడి నర్సింలు గౌడ్, కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్


సన్మానిస్తున్న పలువురు

జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టుకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బదిలీపై వచ్చిన గుడ్ల రామకృష్ణను పద్మశాలి సంక్షేమ సేవ సంఘం అధ్యక్షులు మ్యాక మోహన్‌దాస్, సురుకుట్ల భూమేశ్వర్ కోర్టులోని ఛాంబర్‌లో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ కోర్టు నుంచి బదిలీపై ఆర్మూర్ కోర్టుకు బదిలీపై విచ్చేసిన పద్మశాలి ముద్దు బిడ్డ గుడ్ల రామకృష్ణకు స్వాగతంగా ఆహ్వానిస్తూ న్యాయపరమైన సేవలు పద్మశాలి కులబాంధవులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అడ్వకేట్లు సిలివేరి శ్రీధర్, చిలుక కిష్టయ్య, జక్కుల శ్రీధర్, ద్యావర్ శెట్టి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వివాహిత మృతి

- భర్త వేధింపులతో మానసిక కృంగిపోవడంతోనే..

నవతెలంగాణ-ఆర్మూర్


మృతి చెందిన ఆస్ర

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నివసిస్తున్న పడకల్ విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ కూతురు ఆస్ర (28) అనే వివాహిత గుండెపోటుతో మృతి చెందింది. కాగా శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లికి చెందిన సులేమాన్ అలీ ఖాన్‌తో ఐదేండ్ల క్రితం వివాహం జరిగింది. తన కూతురిని అల్లుడు వేధిస్తున్నాడని జిల్లాలోని 6వ పోలీస్‌స్టేషన్‌లో గురువారం తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సాయంత్రమే ప్రైవేటు ఆసుపత్రికి తరలించేలోపు గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. పెండ్లయిన నాటి నుంచి అల్లుడు తన కూతుర్ని వేధిస్తున్నాడని భర్త వేధింపులతోనే మానసికంగా కృంగిపోయి గుండెపోటు వచ్చిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చనిపోయిన ఆస్రకు ఇటీవలే అమ్మాయి జన్మించింది.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సిపిఐ ఆహ్వానిస్తుందని సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య తెలిపారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణపై మొట్టమొదటిసారిగా మద్దతు పలికిన జాతీయ పార్టీ సిపిఐయేనని తెలిపారు. ఆనాడు సిపిఐ ఎంపీగా ఉన్న కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి పార్లమెంట్‌లో నిలదీశారని గుర్తుచేశారు. గత 30 సంవత్సరాలుగా ఈ వర్గీకరణపై పోరాటాలు చేసి అమలు చేసుకోవాలని చూసిన ఎస్సీలు, ఎస్టీలు ఈరోజు సంతోషంగా ఈ తీర్పును ఆహ్వానిస్తున్నారని దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ విషయంలో అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానిస్తూ ఇప్పటికే వివిధ రంగాల్లో ఇచ్చిన నోటిఫికేషన్‌లకు వర్గీకరణ తీర్పును అమలు చేస్తామని చెప్పడం సంతోషకరమని వివరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.రఘురాం, ఆనంద్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ, విడిసి చైర్మన్‌కు సన్మానం


మాజీ ఎంపీటీసీ, విడిసి చైర్మన్‌లను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో శుక్రవారం సెవెన్ హిల్స్ సిండికేట్ ఆధ్వర్యంలో తాజా మాజీ ఎంపీటీసీ చింతల దాస్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ సిండికేట్ సభ్యులు మాట్లాడుతూ ఐదేళ్లపాటు ఎంపిటిసి గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించడమే కాకుండా గ్రామ అభివృద్ధి కి పాటు పడ్డారని వివరించారు. గత నెలలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ధర్పల్లి ప్రభాకర్ హయాంలో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెవెన్ హిల్స్ సిండికేట్ సభ్యులు కుమ్మరి సాయిబాబా, దోంతుల నరేష్, దర్శపు గంగ మోహన్, పిల్లి గంగాధర్, పిల్లి నరేందర్, ఆసది సాయిలు తోపాటు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సెస్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ ఎమ్మెల్సీ, ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ (ఏపీఈ, ఐపిసిహెచ్, ఐఎంబిఏ, ఒకటవ, మూడవ, నాలుగవ, ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు 3వ రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. తెలంగాణ వర్సిటీ మెయిన్ క్యాంపస్, తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్ భిక్కనూర్, గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడలో జరిగిన పరీక్షకు ఉదయం 200 మంది విద్యార్థులకు 182 మంది విద్యార్థులు హాజరయ్యారు. 18 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. మధ్యాహ్నం తెలంగాణ వర్సిటీలో మెయిన్ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల్లో 04 మంది విద్యార్థులకు గానూ 04 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలియజేశారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఏర్గట్ల


కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పలువురు

మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ మండల నాయకులు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోళ్ళ శివకుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా ఆదివాసీ బిడ్డ, మహిళా మంత్రి సీతక్క పట్ల బీఆర్ఎస్ నాయకులు అవమానకరంగా మాట్లాడడం పట్ల తీవ్రంగా ఖండిస్తూ.. ఏర్గట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ తరపున కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్‌రెడ్డి, నాయకులు రేండ్ల రాజారెడ్డి, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, దండేవోయిన సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- 'టోల్ ఫ్రీ 14446 నెంబర్'కు సమాచారం అందించాలని పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన నషా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులు, కమిటీ ప్రతినిధులు పాల్గొని, జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రవాణా, వినియోగం పెను సవాలుగా మారిందని అన్నారు. యువత, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు రవాణా, వినియోగం జరుగకుండా అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇది కేవలం ప్రభుత్వ యంత్రాంగాల బాధ్యత అని భావించకుండా సమాజంలోని వివిధ వర్గాల వారందరూ మాదకద్రవ్యాల నిరోధానికి తమవంతు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, వాటితో ముడిపడిన కార్యకలాపాలను గమనిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 14446కు కాల్ చేసి కూడా సమాచారం తెలుపవచ్చని సూచించారు. సమాజానికి పెను ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటు పడి వాటికి బానిసలుగా మారిన వారు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా నష్టపోతారని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించేందుకు విస్తృతస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్, బోధన్ వంటి పట్టణాలలోనూ క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జనసంచారంతో కూడుకుని ఉండే ప్రదేశాలలో వాల్ రైటింగ్, పెయింటింగ్‌ల ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాలని అన్నారు. కళాజాత బృందాలచే గ్రామగ్రామాన ప్రదర్శనలు నిర్వహించాలని, సామాజిక మాధ్యమాలు, సినిమా థియేటర్‌లలో షార్ట్‌ఫిలింలు ప్రదర్శింపజేయాలని సూచించారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతోందని అన్నారు. జిల్లాలో గంజాయి వినియోగం, రవాణాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ కఠిన చర్యలు చేపడుతుండడం వల్ల పరిస్థితిలో కొంతవరకు వినియోగం తగ్గిందని తెలిపారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి నిజామాబాద్ మీదుగా మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు గంజాయి రవాణా చేస్తుంటారని, ఈ అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘా కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను పూర్తిగా నిరోధించేలా అన్ని వర్గాల వారు తోడ్పాటును అందించాలని కోరారు.

సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారిణి రసూల్ బీ, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ తుకారాం రాథోడ్, విద్యశాఖ పరీక్షల నియంత్రణ విభాగం అధికారి విజయభాస్కర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, ఎన్.వై.కే సమన్వయకర్త శైలి బెల్లాల్, కమిటీ సభ్యులైన మానసిక వైద్య నిపుణులు ఏ.విశాల్, బి.కేశవులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి రామ్మోహన్‌రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలవి విద్యార్థి వ్యతిరేక విధానాలు

- సమరశీల విద్యార్థి ఉద్యమాల ద్వారా ప్రతిఘటిద్దాం
- ఏఐఎఫ్డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఏఐఎఫ్డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, అందుకుగానూ సమరశీల విద్యార్థి ఉద్యమాల ద్వారా ప్రతిఘటిద్దామని ఏఐఎఫ్డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఏఐఎఫ్డిఎస్ జాతీయ జనరల్ బాడి 2వరోజు కొనసాగింపులో భాగంగా నూతన జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. ఏఐఎస్డిఎస్ జాతీయ కన్వీనర్‌గా మేత్రీ రాజశేఖర్, కమిటీ సభ్యులుగా రాజు పాశ్వాన్, అమన్, గడ్డం నాగార్జున, పల్లె మురళి, కాశీ, సంజీవ్ చౌహాన్, ఆదర్శ్, బబ్లూ, మాలోతు జబ్బర్‌నాయక్, రవీందర్‌సింగ్, ఆనంద్‌ను వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ జనరల్ బాడీ సమావేశానికి కామ్రేడ్ రాజు పాశ్వాన్, మాస్ సావిత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎఫ్డిఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్ మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలలో నాణ్యమైన విద్యా వ్యవస్థ కొనసాగుతుందని, నాణ్యమైన ప్రమాణాలతో, సకల సౌకర్యాలతో వైద్య, ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ విభాగాలలో జపాన్, ఫిన్లాండ్, చైనా, రష్యా, వెనుజుల, ఆస్ట్రేలియా, యుకె లాంటి దేశాల్లో సరైన విద్యా వ్యవస్థతో అగ్రగామిగా నిలుస్తూ మన భారత దేశ విద్యా వ్యవస్థను వెక్కిరించే విధంగా పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యాపారం ముడుపు వ్వులు ఆరుకాయలుగా లాభాలతో నడుస్తుందని, 2009 విద్యా హక్కుచట్టం ఏ ఒక్క పాఠశాలలో అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నిర్బంధ అమలు చేయలేకపోయిందని, కావున రేవంత్ రెడ్డి ప్రభుత్వమైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లే మురళీ, ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర నాయకులు జబ్బర్ నాయక్, ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, వస్కుల భరత్, జన్ను రమేష్, ఎమ్‌డీ మోసిన్, కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు సామాజిక న్యాయానికి ప్రతిబింబం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న బహుజన లెఫ్ట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి రాష్ట్ర కమిటి స్వాగతిస్తున్నట్లు బహుజన లెఫ్ట్ పార్టీ- బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ తెలిపారు. శుక్రవారం నగరంలోని సుభాష్‌నగర్‌లో గల బహుజన లెఫ్ట్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ముప్పై సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ సోదరులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో చేసిన పోరాటాలకు సుప్రీంకోర్టుతో ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ ఉప కులాలకు భవిష్యత్తులో విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగంలో సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎస్టీ తెగలైన ఆదివాసీ, నాయకపోడు, ఎరుకల, లంబాడా తదితర ఎస్టీ గిరిజన తెగలకు రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం అందుతుందని వెల్లడించారు. అయితే గత పది సంవత్సరాలుగా బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆధిపత్య ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగంలో రోజురోజుకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలు కోసం ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఉద్యమించాలని, అదేవిధంగా మాదిగ దండోరా ఉద్యమ అనుభవాల స్ఫూర్తితో బిసి కులాల ప్రజలు అన్ని రంగాల్లో సమాన వాటా కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి జిల్లా అధ్యక్షురాలు సబ్బని లత, ఉపాధ్యక్షులు కాంబ్లే మధు, సాయి కాంబ్లే, నగర ఉపాధ్యక్షులు టి.రాజు పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాలు శుభ్రపరచుకోవాలి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని బేగంపూర్, కస్లాబాద్, వడ్లం, గ్రామాలలో సీజన్ వ్యాధుల పట్ల మండల పంచాయతీ అధికారి లక్ష్మీకాంతరెడ్డి గ్రామస్తులకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలను పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒకరు ఎవరి ఇంటి ముందు వారే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇండ్లలో చెత్తాచదారం లేకుండా చూసుకోవాలని, దీంతోపాటు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు చెత్తను అందులోని వేయాలని ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు బరువుల గురించి తెలుసుకొని పిల్లలకు మెరుగైన పోషక పదార్థాలను అందించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ఇందల్, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ పెంచినందుకు సారథి కళాకారుల హర్షం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు పిఆర్సీ పెంచినందున రాష్ట్ర ప్రభుత్వానికి సారథి కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. గత 9 సంవత్సరాలుగా 24,514 ఇవ్వగా ఇప్పుడున్న ప్రభుత్వం సారథి కళాకారులకు రూ.31,868 పెంచిన పిఆర్సీని ఇవ్వగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నిజామాబాద్ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్క క్రాంతికుమార్, రాంపూర్ సాయి, లవోల సాయి, గోరకంటి రాజు, రవినాయక్, రాజేందర్, సతీష్, నర్సయ్య, మీనాక్షి, మనోజ, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షునిగా సిద్దాల నాగరాజు

నవతెలంగాణ-ఆర్మూర్

యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 1న జిల్లా కేంద్రంలోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో జిల్లా విస్తృత సమావేశాన్ని ఇటీవల నిర్వహించగా.. డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజును యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సిద్దాల నాగరాజు మాట్లాడుతూ.. నిరంతరం విద్యారంగ సమస్యల పట్ల, ప్రజా సంఘ క్రమశిక్షణ పాటిస్తూ, నియమ నిబద్ధతతో పనిచేసేటువంటి కార్యకర్తలకు ఎల్లవేళలా రాష్ట్ర కమిటీ ప్రాతినిధ్యం ఇస్తుందని అన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఎల్లమ్మ గడ్డ తండా, ఎల్లారం, లింగంపల్లి గ్రామాల్లో చేపడుతున్నటువంటి పారిశుధ్య పనులను ఎంపీడీవో నరేష్ శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్యం లోపించకుండా చెత్త చెదారం నిల్వ ఉండకుండా తొలగించాలని సూచించారు. ఆయన వెంట ఏపిఎం శ్రీనివాస్, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

లింగంపల్లిలో ఘనంగా బోనాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని లింగంపల్లి కలాన్‌లో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపు చేపట్టి పోచమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తార గ్రామంలో మాజీ సర్పంచ్ కుమార్ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్

నవతెలంగాణ-ఆర్మూర్


డాక్టర్ అశోక్

గతవారం రోజుల నుంచి వైరల్ ఫీవర్లు ఎక్కువవుతున్న నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖ్యంగా డెంగ్యూ జ్వరాలు ఎక్కువయ్యాయని వివరించారు. దీనిపై ఎటువంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నిలువ నీరు ఉంచుకోకూడదని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎడిస్ మస్కిటో దోమ వృద్ధి చెందే అవకాశం ఉందని, ముఖ్యంగా సాయంకాలం పట్ల ఈ దోమలు కుడతాయని, పారాసిటమల్ టాబ్లెట్ వేసుకొని ద్రవ పదార్థాలను తీసుకోవాలని, ఎక్కువగా జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

తపస్విలో అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తపస్వి తేజో నిలయం వద్ద బోధన్ ఎమ్మెల్యే సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య, అయ్యప్ప శ్రీనివాస్, వైస్ చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్ ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

ఓబిసి మహాసభను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు నర్సయ్య ఆధ్వర్యంలో ఆగస్టు 7న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగే జాతీయ ఓబీసీ 9వ మహాసభ పోస్టర్లను తోటి బీసీ నాయకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వస్తున్న దాదాపు పదివేలకు మందికిపైగా ముఖ్యమైన డెలిగేట్స్‌తో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జాతీయ ఓబీసీ 9వ మహాసభ ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టి బీసీల లెక్క తేల్చాలంటూ, కేంద్రంలో బీసీ మంత్రి శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ ఇవ్వాలని ప్రధాన డిమాండ్‌లతో ఈ మహాసభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కావున ఈ మహాసభకు బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు నర్సయ్య జిల్లా నాయకులు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ ద్యాగా శేఖర్, జోగు నరేందర్, కృష్ణ, జక్కుల జీవన్, కృష్ణ, పృథ్వీ వల్లభ్, సుదర్శన్, పెంటు భూమేశ్వర్, నందన్‌గౌడ్, వంశీ, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్యాంపస్ విద్యార్థి మృతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సౌత్ క్యాంపస్ విద్యార్థి అక్కడికక్కడే మరణించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థి ప్రీతం భిక్కనూర్‌లోని సౌత్ క్యాంపస్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సొంత పనులు నిమిత్తం శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లాడు. కాగా బస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తాకు నడుచుకుంటూ వస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనగా తీవ్ర గాయాలపాలై మృతిచెందాడు. తోటి విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో క్యాంపస్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



పోస్ట్ ఆఫీస్ పథకాలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పోస్ట్ ఆఫీస్ పథకాలపై అవగాహన సదస్సును మండల పరిధిలోని వెలుట్లలో శుక్రవారం తపాల శాఖ ఉన్నత స్థాయి అధికారి సుదీప్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించినట్లు జిల్లా తపాలా శాఖ ఓవర్సీస్ అధికారి మహబూబ్ రెడ్డి తెలిపారు. సుకన్య సమృద్ధి పథకం, టైం డిపాజిట్, రికరింగ్ డిపాజిట్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, మంత్లీ ఇన్కమ్ స్కీం, ఇన్సూరెన్స్ పథకాలు, యాక్సిడెంట్ పాలసీ లపై ప్రజలకు అవగాహన కల్పించామని,తక్కువ వడ్డీతో ఎక్కువ లాభాలు కలిగినటువంటి పోస్ట్ ఆఫీస్ లో ఖాతాలు తెరవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి తపాలా శాఖ బిపిఎం, సిబ్బంది,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పథకాల వివరాలు వెల్లడిస్తున్న అధికారి

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం
- పలు చోట్ల సంబరాలు

నవతెలంగాణ-విలేకరులబృందం

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని పలువురు నాయకులు అన్నారు. తీర్పును స్వాగతిస్తున్నట్టు నాయకులు తెలిపారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల శుక్రవారం సంబరాలు నిర్వహించారు. వర్గీకరణ ఆర్డినెన్స్ తీసుకువచ్చిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని పలువురు కోరారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎం.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల కాలంగా ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతర పోరాటం చేస్తున్నామని, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇవ్వడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు కంతి పద్మారావు,కాశీరాం, తిమోతి, ప్రభాకర్, యాదగిరి, పర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పుతో సంబరాలు

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ వద్దఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఏబిసిడి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రవీందర్ తెలిపారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటానికి సుప్రీం కోర్టు ఇచ్చిన ఫలితం యావత్తు జాతి సంతోషించవలసిన అవసరం ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఇద్దరు ఎస్సీ వర్గీకరణ ఎస్టి వర్గీకరణ ఆర్డినెన్స్ తీసుకువచ్చిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్ లను భర్తీ చేయాలని కోరుతున్నాము. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న నాయకులు



ఎమ్మెల్యేకు స్వీటు తినిపిస్తున్న సదాశివనగర్ మండల నాయకులు

నాగిరెడ్డిపేట్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో శుక్రవారం రోజు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఆవరణలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి నాగిరెడ్డి మండల ఎంఆర్పిఎస్ సంఘం తరపున పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సంఘం మండల కమిటీ అధ్యక్షుడు తొంట సాయిలు, ఉపాధ్యక్షుడు ఎల్లమొల శీను ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల సాయిలు, తోపాటు మాజీ ఎంపీపీ రాజుదాస్, గంపల వెంకన్న ఆత్మకూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మసనం తీర్పు నివ్వడం హర్షించదగ్గ విషయమని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సి విభాగం అధ్యక్షుడు మద్దెల భాగయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును,రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను కలిసి అభినందనలు తెలిపి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదల్ అధ్యక్షుడు లింగాగౌడ్, నియోజకవర్గ యుత్ అధ్యక్షుడు సంపత్ గౌడ్,మండల యుత్ అధ్యక్షుడు అన్వేష్ గౌడ్,మైనారిటీ మండల నాయకులు సాదిక్ అలీ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌తో కలిసి సంబురాలు

ఎస్సీ ఎస్టీ ఏబిసిడి వర్గీకరణ సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను కలిసి స్వీట్ తినిపించి సంబరాలు చేపట్టారు. ఆయనను కలిసిన వారిలో ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

లింగంపేట్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్థాలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికినెల్లూరి గంగారాం మాదిగ ధ్యామాని భూపతి మాదిగ గార్ల ఆధ్వర్యంలో క్షిరా అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో లేగ్గేల.రాజు, కాశీరం, కోళ్లగారి.రాజు, సాయిలు, అల్లూరి, శంకర్, అశోక్, రాములు, సాయిరాం, ఉషయ్య, సాయిలు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

రామారెడ్డి : 30 సంవత్సరాల అలుపెరుగని మాదిగల పోరాటమే ఎస్సీ వర్గీకరణ అని జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యదర్శి కొత్తల యాదగిరి శుక్రవారం అన్నారు. మండలంలోని ఉప్పల్ వాయి, రామారెడ్డి లో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బట్టు వెంకట రాములు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మి గురజాల నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ గంగారం, రాజనర్సు, కిషన్, నర్సింలు, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

మా రుణాలు మీరే చెల్లించాలి

- గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సీజీఎంను కలిసిన రైతులు

నవతెలంగాణ-సదాశివనగర్

తమ పేరిట అక్రమంగా రుణాలు తీసుకోవడంతో తమకు రుణమాఫీ వర్తించలేదని, కావున తమ రుణాలు మీరే చెల్లించాలని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ రైతులు కోరారు. ఫ్యాక్టరీ సీజీఎం వేణుగోపాల్‌ను శుక్రవారం కలిశారు. తమ పేరు మీద టయప్ లోన్ తీసుకున్నందున తమ లోన్లకు రుణమాఫీ వర్తించకుంటే మీరే తీర్చాలని రైతులు సీజీఎం వేణుగోపాల్‌ను కోరారు. ఆయన స్పందిస్తూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తాము బాధ్యత వహిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సదాశివనగర్ సింగిల్ విండో చైర్మన్ కమలాకర్ రావు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, సదాశివనగర్ మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి కుప్రియాల మాజీ ఉపసర్పంచ్ కలాలి చుక్క సాయ గౌడ్, చౌకీ నాగరాజు, మంగళి సాయిలు, నల్ల శ్రీనివాసరెడ్డి, నారెడ్డి విట్టల్, తదితరులు పాల్గొన్నారు.



సీజీఎంతో మాట్లాడుతున్న రైతులు

పరుగుపందెంలో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్క నూర్ పట్టణంలోని విద్యార్థులు జిల్లాస్థాయి పరుగు పందెంలో మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కోచ్ భరత్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్ 14 మీటర్స్ 400 పరుగు పందెంలో భిక్కనూరు విద్యార్థులు నిరీక్షణ గోల్డ్ మెడల్, భరత్ కుమార్ సిల్వర్ మెడల్, రవళి బ్రోంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. మెడల్ సాధించిన విద్యార్థులను ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



గిరిజన మోర్చా జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

భారతీయ జనతా పార్టీ గిరిజన మార్చా (ఎస్టి మోర్చా) నూతన కార్యవర్గాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణా తారా శుక్రవారం ప్రకటించారు. కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆదేశాల మేరకు గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు గా బదావత్ నవీన్ నాయక్ నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిలుగా బానోతు నరేష్, రాథోడ్ రంజిత్, ఉపాధ్యక్షులుగా మాలోత్ శ్రీను, ఎరుకల రఘు, శంకర్, బానోతు రాజు, గంగులోత్ గణేష్,, సహాయ కార్యదర్శులుగా విశాల్వత్ గోవింద్, ఎస్ గణేష్, బాలు నాయక్, మీనా భాయ్, కోశాధికారిగా బి నారాయణ ఐటీ సెల్ అధ్యక్షులుగా బట్టు రాహుల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా లకావత్ రాజం బానోత్ మైపాల్, బర్మావత్ గబ్బర్ సింగ్, బానోత్ మహేందర్, రతాల్వత్ బాలు తదితరులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

గిరిజన మోర్చా కన్వీనర్‌గా కంట్రోత్ రవి

గాంధారి : మండలంలోని పెద్ద గుజ్జుల్ తండాకు చెందిన బీజేపీ నాయకులు కంట్రోత్ రవిని జహీరాబాద్ పార్లమెంట్ గిరిజన మోర్చా కన్వీనర్‌గా, ఆసిఫాబాద్ జిల్లా ఇంచార్జ్‌గా బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్ నియమించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పనిని సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

అభినందనసభకు తరలిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-పిట్లం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిర్వహించిన అభినందన సభకు పిట్లం, పెద్దకొడప్గల్ , మద్నూర్ మండలాల ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు శాఖ మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయ పదోన్నతులు , బదిలీలు లేక న్యాయపరమైన చిక్కులతో కొట్టుమిట్టాడుతున్న ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి భారీ మొత్తంలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు , బదిలీలు చేపట్టి ఉపాధ్యాయుల గౌరవ ప్రతిష్టలు కాపాడారని కొనియాడారు. మండల శాఖ తరపున ఉపాధ్యాయులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులతో పాటు రాష్ట్ర కార్యదర్శులు ప్రమోద్ కుమార్ , విట్టల్ , జిల్లా అధ్యక్షులు సంతోష్ రెడ్డి , వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్క నూరు పట్టణా నికి ఇతర ప్రాంతాల నుండి అక్రమం గా ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ శుక్రవారం తెలిపారు. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దపల్లి నుండి కాచాపూర్ తరలిస్తున్నటువంటి రెండు లారీలను పట్టుకొని లారీలను సీజ్ చేసి డ్రైవర్ రాజు, మహేష్ ల పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా ఇసుక, పిడిఎస్ బియ్యం తరలిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శిఖం భూముల కబ్జాలు పరిశీలన

నవతెలంగాణ-నిజాంసాగర్

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా గురువారం మల్లూరు గ్రామానికి చెందిన రైతులు నిజాం సాగర్‌లో కొత్తింటి నాగరాజ్, ఒంటరి నారాయణ రెడ్డి తదితర రైతులు చెరువుల కబ్జా గురించి కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. స్పందించిన కలెక్టర్ చెరువుల పై అర తీయాలని మండల రెవెన్యూ అధికారి బిక్షపతికి ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం సాయంత్రం రెవెన్యూ అధికారులు చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మల్లూరు గ్రామంలోని రాళ్ల చెరువు, మైసిరెడ్డి చెరువు, బామన్ చెరువు కబ్జాకు గురి అయ్యాయని రైతులు అధికారులకు వివరించారు. దీనివల్ల పంటలు సంవత్సరానికి రెండు సార్లు చొప్పున పండాల్సి ఉండగా కేవలం ఒకేసారి పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులలో ఎత్తుగా కట్టలు పోస్తున్నారని చెరువు విస్తీర్ణం సంవత్సరానికి ఇంత తగ్గుతూ వస్తుందని వారు తెలిపారు. దీని ద్వారా చెరువులు త్వరగా ఎండిపోతున్నాయని వేసవికాలంలో నీటి ఎద్దడి కరువు ఏర్పడుతున్నాయని వారు వివరించారు. వెంటనే చెరువుల శిఖం ఏర్పాటు చేసి కబ్జాకు గురి అయిన చెరువులను కాపాడాలని వారు మండల రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



భూములు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాధాదేవి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా రాధాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ బోరబండ జూనియర్ కళాశాల నుండి బదిలీపై భిక్కనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చారు. అంతకుముందు భిక్కనూర్ కళాశాల ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహించిన శ్రీనాథ్ ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు.



ఏబీవీపీ మండల కన్వీనర్‌గా రాకేష్

నవతెలంగాణ-దోమకొండ

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ దోమకొండ మండల కన్వీనర్ గా రాకేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా ఏబీవీపీ నాయకులు వెంకటేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేయాలనీ కోరారు. జాతీయవాదపు స్ఫూర్తితో ముందుకు నడవాలని సూచించారు.

ఫ్రైడే ను డ్రై డేగా పాటించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెల్లుట్ల పేట గ్రామాన్ని శుక్రవారం నాడు ఎల్లారెడ్డి మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) ప్రకాష్ సందర్శించారు. గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ ప్రతి ఇంటింటా పరిసరాల శుభ్రతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ ఇండ్ల చుట్టూ పరిసరాలలో మురికి నిలవకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని ,నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పనికిరాని పాత్రలు, పారవేసిన కప్పులు ,కొబ్బరి చిప్పలు, వాడకం లేని బకెట్లు, కుండీలు వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే దోమ లార్వా అందులో పెరిగి దోమల బెడద ఎక్కువ అవుతుందని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న గుర్తించి శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్,వైద్య సిబ్బంది,అంగన్వాడీ టీచర్లు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా అడ్మిషన్ తీసుకుంటూ

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయద్దు

ప్రయివేటు డిగ్రీ కాలుజీలు తీరుమార్చుకోవాలి : ఏబీవీపీ

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రైవేట్ డిగ్రీ కళాశాల యజమాన్యాలు తమ తీరు మార్చుకోవాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామారెడ్డి జిల్లా ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కామారెడ్డి పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేటు డిగ్రీ కళాశాలలలో విద్యార్థులను బలవంతంగా అడ్మిషన్లు చేయించుకుంటున్నారని, కానీ అక్కడ చదువుకోవడం ఇష్టం లేక వేరే కాలేజీకి వెళ్లిపోదాం అని తమ సర్టిఫికెట్లు ఇవ్వాలని విద్యార్థులు కోరితే సర్టిఫికేట్‌ల కోసం పదివేల ఫీజు కట్టాలని డిమాండ్ చేయడం సరికాదని అన్నారు. ఈ వైఖరిని సదరు డిగ్రీ కళాశాల యజమాన్యాలు వెంటనే ఆపివేయాలని లేనియెడల ఏబీవీపీ ఆధ్వర్యంలో దీనిపై తీవ్రంగా ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవిపి కార్యకర్తలు కృష్ణ, రాకేష్, అల్తాఫ్ పాల్గొన్నారు.

పండుగలా స్వచ్ఛధనం పచ్చదనం చేపట్టాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

ఈనెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఆయా గ్రామాల్లోపల నిర్వహించే స్వచ్ఛ తనం పచ్చదనం కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించాలని ఎల్లారెడ్డి డిఎల్పిఓ సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల ఐదు నుండి తొమ్మిదవ తరగతి వరకు గ్రామాలలో రోజుకో కార్యక్రమం నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఏపీఓ సాయిలు ఉన్నారు.



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

తల్లిపాలు అమృతం లాంటివి

- పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే రోగనిరోధకశక్తి

నవతెలంగాణ-రామారెడ్డి/లింగంపేట్/పిట్లం

తల్లిపాలు అమృతం లాంటివని రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సురేష్ శుక్రవారం అన్నారు. మండలంలోని కన్నాపూర్, రామారెడ్డిలో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్ పాల్గొని మాట్లాడుతూ.. ముర్రుపాలు బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంచుతుందని అన్నారు. తల్లి పాలు బిడ్డకు అందించడం వలన, తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, గుండె జబ్బులు, ఎముకలు అరిగిపోవడం వంటి అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుతుందని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని మత్తడి కిందిపల్లిలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్వైజర్ హరిత మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతను తల్లులకు, గర్భవతులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుచేరిత, హెల్పెర్ విజయ, ఆశా, బాలింతలు, పాల్గొన్నారు.

పిట్లం : బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని సెక్టర్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. మండలంలోని తిమ్మానగర్ ఒకటవ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లులు ప్రసవ నంతరం బిడ్డకు ముర్రుపాలు అందించినచో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. బిడ్డకు పై పాలు అందించకుండా ఆరు నెలల వరకు తల్లిపాలే అందించినచో తల్లి బిడ్డలు క్షేమంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పి.గంగామణి, పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవని సూపర్‌వైజర్ భారతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ సెంటర్లో బాలింతలకు గర్భిణీలకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిమురుపాలు అందించాలని ఆపాలలో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెంచుతుందని తెలిపారు. ప్రతి ఒక్క బాలింత బలవర్ధకమైన ఆహారం పాలు గుడ్లు తాజా కూరగాయలు తీసుకోవాలని ఆమె సూచించారు కార్యక్రమంలో ఆమెతోపాటు అంగన్వాడీ టీచర్ తులసి ఉన్నారు.



పిట్లం మండలం తిమ్మానగర్‌లో..

రైతులను మోసం చేసిన

బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

- 5న చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

నవతెలంగాణ-కామారెడ్డి

సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆగస్టు 5న చలో కలెక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయినా మాట్లాడుతూ.. సదాశివనగర్ మండలంలో ఉన్నటు వంటి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు సంబంధం లేకుండా రైతుల పేరిట నిజామా బాద్ జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ లో రుణాలు తీసుకున్నారని, ఈ విధంగా రైతులను మోసం చేసినటువంటి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం రైతులకు సంబంధం లేకుండా గాయత్రి షుగర్ యజమాన్యానికి రుణాలు ఇచ్చినటువంటి ఆనాటి బ్యాంక్ మేనేజర్ ఎవరున్నా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

షుగర్ రైతులు ఫ్యాక్టరీ యజమాన్యంతో తమ సదుపాయాల కోసం వ్యక్తిగత రుణాల కోసం తమ భూమి పాసుబుక్కులను జిరాక్స్‌లను సంతకాలు చేసి ఇస్తే ఇంటి పాసుబుక్కులు జిరాక్సులు తమ వద్ద పెట్టుకుని ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే రుణమాఫీ లాంటి డబ్బులను బ్యాంకు అధికారులను మంచిగా చేసుకుని డబ్బులనుకాజేసినట్లు వెళ్లడైందనీ ఆయన ఆరోపించారు. సుమారు 2500 మంది రైతులకు చెందిన సుమారు 25 నుంచి 30 కోట్ల రుణమాఫీ డబ్బులను కాజెచేసినట్లుగా స్పష్టమైందన్నారు. ఈ కుట్రకు పాల్పడిన గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు పెట్టి రైతుల రుణమాఫీ డబ్బులు రికవరీ చేసి రైతులకు అందించాలన్నారు. అన్ని గ్రామాల రైతులను కలుపుకొని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా నాయకులు ప్రకాష్, సురేష్, బాలరాజు, రమేష్, బాబన్న, కిషోర్, అనీష్, కిషోర్, సాయన్న, రైతులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- డబ్బులు తీసుకొని మోసం చేసిన నిందితుడి అరెస్టు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన చిలుక జ్యోతికి.. తన భర్త నవీన్‌తో కలిసి ఎంఎస్ఎన్ కంపెనీలో పని చేస్తున్న సుంచు ప్రవీణ్ అనే వ్యక్తి, తనకు తెలిసిన వారి దగ్గర గవర్నమెంట్ కార్యాలయం లో ఔట్సోర్సింగ్ విభాగంలో జాబులు ఇప్పిస్తానని నమ్మించాడు.

తనతో పాటుగా వారి స్నేహితులు, బంధువులు దాదాపుగా పది, పదిహేను మంది వద్ద నుండి మొత్తం ఎనిమిది లక్షల 45 వేల రూపాయలు, మరికొంతమంది వద్ద కూడా ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుని, జాబ్ ఇప్పియకుండా, ఫేక్ జాబ్ అపాయింట్మెంట్ లెటర్స్ ఇచ్చి మోసం చేసి పారిపోయినాడు అని ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేపట్టారు.

విచారణలో భాగంగా మెదక్ జిల్లా, నిజాంపేట మండలం, బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన సుంచు ప్రవీణ్ ,(35) ఆ వ్యక్తి ఊర్లో నుండి పారిపోయి హైదరాబాదులో ఉంటున్నాడని తెలుసుకొని, అక్కడి నుండి అతని పట్టుకుని వచ్చి అరెస్టు చేసి రిమాండ్ కి తరలించినట్టు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో దళారుల మాటలు నమ్మి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి మాటలు నమ్మకూడదని, ఎవరైనా అలా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తే వారిపై పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయాలని కోరారు.

నేడు పుస్తకాల వితరణ

నవతెలంగాణ-కామారెడ్డి

బి.యస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు (శనివారం) జిల్లా గ్రంథాలయనికి పుస్తకాలను వితరణ చేస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిఎస్.రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాలలో ఎక్కువగా నిరుద్యోగులు వివిధ పరీక్ష పోటీలకు సిద్ధమవ్వడానికి గ్రంథాలయాలలో చదువుకోవడానికి వస్తున్న జిల్లాలను గుర్తించి ఆ గ్రంథాలయాలకు తెలుగులో మూడు సెట్లు, ఇంగ్లీష్ లో ఒక సెట్టు మొత్తం నాలుగు సెట్ల పుస్తకాలను వితరణ చేస్తున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలోని బీసీ కాలనీలో శనివారం నాడు నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగించనున్నట్టు లైన్‌మెన్ లక్ష్మీనారాయణ తెలిపారు. దీంతో శనివారం రోజు ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు తెలిపారు. బీసీ కాలనీ, ఎర్రమనుకుచ్చా, టీచర్స్ కాలనీ, నయాబాద్, గాంధీ చౌక్ నుండి మోడల్ స్కూల్ వరకు లక్ష్మీ టాకీస్ నుండి దేవునిపల్లి వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముఖ్యమంత్రి సమావేశానికి తరలిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశానికి బోధన్ మండలం నుంచి 250 మంది ఉపాధ్యాయులు బస్సులలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు డివిజన్ నాయకులు ఎంబెల్లి శంకర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ప్రమోషన్లు నేటి సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులకు ఇవ్వడం ద్వారా ఉపాధ్యాయ లోకానికి ఎంతో మేలు చేశారని తద్వారా సుమారు 20,000 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొంది సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్, మండల బాధ్యులు కైరాన్, ధన్‌రాజ్, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్, ఉదయ్, కిషోర్ శంకర్, వివిధ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌ఓ రాజశ్రీ

నవతెలంగాణ-భీంగల్

వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని డిఎంహెచ్ఓ రాజశ్రీ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపి సేవలను గూర్చి మెడికల్ ఆఫీసర్ అజయ్ పవర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశమున్నందున సిబ్బంది వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి ఆరోగ్య కేంద్రంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సిబ్బందికి తెలియజేశారు. అలాగే డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా భీంగల్ ప్రాంతానికి చెందిన డిఎంహెచ్ఓకు మెడికల్ ఆఫీసర్ అజయ్ పవర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈమె వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ రమేష్, డాక్టర్ నాగరాజు, మెడికల్ ఆఫీసర్ అజయ్ పవర్, డాక్టర్ తేజస్విని, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

జాన్కంపేట్‌లో పోస్టల్ స్కీంపై అవగాహన



పోస్టల్ అధికారిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్(వేల్పూర్)

మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ స్కీములపై కరపత్రాలను పంపిణీ చేశారు. పలుస్కీములు, పాలసీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ఏఎస్పీ శ్రావణ్ మాట్లాడుతూ.. పోస్టాఫీస్‌లో కుటుంబంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే పోస్టల్ స్కీములు ఉంటాయని తెలిపారు. అందులో జన్ సురక్ష యోజనలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, స్పీడ్ పోస్ట్ సర్వీసెస్, ఆధార్ సర్వీసెస్, జీవన్ ప్రమాణ పత్రం, ఆధార్ మనీ ఏటీఎం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, అలాగే మీ పేరు మీద 500లతో ఎస్బి ఎకౌంటు ఓపెన్ చేయవచ్చని, అలాగే ఆర్డీలు నెలనెలా కట్టవచ్చని, సుకన్య సమృద్ధి యోజన 10 సంవత్సరాల లోపలి బాలికలకు నెల నెలా డిపాజిట్ చేస్తే వారు పెళ్లీడుకు వచ్చేసరికి డబ్బులు ఉపయోగపడతాయని తెలిపారు. బ్యాంకు మాదిరిగా డిపాజిట్ చేసే వారి కొరకు కిషన్ వికాసపత్రము, ఇందిరా వికాస పత్రాలు ఉంటాయని, ప్రమాద బీమా పాలసీలు, అతి తక్కువ ధరలలో యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీలకు ఖాతాలు ఓపెన్ చేసుకోవచ్చని, బ్యాంకు మాదిరిగా గ్రామంలో మీ ఇంటి దగ్గర నుంచి లావాదేవీలు జరుపుకోవచ్చని సూచించారు. ఈ సదావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ వినోద, గ్రామ కార్యదర్శి మౌనిక స్కీమ్ పోస్టల్ స్కీముల గురించి సవివరంగా ప్రజలకు అర్థమయ్యేటట్లు వివరించారు. గ్రామస్తులు స్కీమ్ హెూల్డర్స్ కూడా తమ అనుభవాన్ని అందరిముందు తెలియజేశారు. అనంతరం బీపీఎంలందరూ ఏఎస్పీ శ్రావణ్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా జింధం నరహరి వ్యవహరించారు.

మధ్యాహ్న భోజనం పున:ప్రారంభం



ఆర్థిక సాయం అందజేస్తున్న హెచ్‌ఆర్‌సి జిల్లా డైరెక్టర్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద గల ప్రాథమిక పాఠశాలలో దాదాపు ఆరు నెలల విరామం తర్వాత మధ్యాహ్న భోజనం ప్రారంభమైమట్లు ప్రధానోపాధ్యాయులు నారాయణ తెలిపారు. వంట చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో మధ్యాహ్న భోజనం ఆగిపోయిందని, హెచ్.ఆర్.సి జిల్లా డైరెక్టర్ మధ్యాహ్న భోజనానికి ఆర్థిక సహాయాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వీడిసి చైర్మన్, వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

మహిళలకు అగౌరవపర్చిన ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి

- మాజీ ఎంపిపి నల్ల సారిక హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి



శాసన సభ్యులను చూడకుండా ఓ మాజీ మంత్రిని బహిరంగంగా తమ పార్టీ మహిళా ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డిపై వాడిన భాష తీరుకు గానూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ ఎంపిపి నల్ల సారిక హన్మంత్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి గురువారం మాట్లాడిన మాటలు యావత్ రాష్ట్ర మహిలోకం చూసిందని తెలిపారు. ముఖ్యమంత్రి పదవి హుందాతనాన్ని కాపాడుకోవాలని అన్నారు. అలాగే రాజకీయాలు సహజ మని.. కానీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలను గౌరవించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామంలో సైబర్ నేరాలపై ఏఎస్ఐ ఇలియస్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ అధికారులమని చెబుతూ ఫోన్‌కాల్స్ చేస్తూ డబ్బులు వసూలు చేసు న్నారని ఫేక్‌కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ మోహన్, నరేష్, అశోక్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు దాతల విరాళాలు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో శుక్రవారం మండల కేంద్రానికి చెందిన దోమకొండ బాలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడంతో మృతురాలి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో మండల కేంద్రానికి చెందిన పలువురు ప్రముఖులు విరాళాలు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రూ.5 వేలు, మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ రూ.5వేలు, మాజీ ఎంపీపీ భర్త సామ వెంకట్ రెడ్డి రూ.3వేలు, జోగు నర్సయ్య రూ.2500 రూపాయలు, మాజీ ఉప సర్పంచ్ బ్రమ్మదండి లింగం 25 కిలోల బియ్యం సంచిని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు విరాళం అందజేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ డిపో వద్ద గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆర్టీసీ డిపో వద్ద గంజాయిని పట్టుకున్నట్లు నాల్గవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మనోజ్ శుక్రవారం తెలిపారు. నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మనోజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగో టౌన్ పరిధిలోని ఆర్టీసీ-2 డిపో వద్ద గురువారం రాత్రి పోలీసులు గస్తీ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

- 6 నెలల వరకూ బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలి
- సూచించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు
- తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం

పుట్టిన బిడ్డకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూచించారు. పుట్టినప్పటి నుంచి 6నెలల వరకూ బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలుచోట్ల బాలింతలకు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు.

జక్రాన్‌పల్లి : తల్లి పాలు బిడ్డకు ఉత్తమమైన పోషకాహారాన్ని అందిస్తుందని మండల అంగన్వాడి సూపర్వైజర్ ఎస్తేర్‌రాణి అన్నారు. మండలంలోని పరకాల గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలకు అంగన్వాడి సూపర్వైజర్ హాజరై మాట్లాడారు. తల్లిపాలు మెదడు అభివృద్ధికి సహాయ పడుతుందని అన్నారు. త్వరగా జీర్ణం అవుతుందని తెలిపారు. తల్లికి బిడ్డకు మధ్య అనుబంధాన్ని పెంచుతుందని తెలియజేశారు. బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు సంపూర్ణ ఆహారం తల్లిపాలేనని తెలియజేశారు. తల్లిపాలు బిడ్డను అనారోగ్యాల నుండి కాపాడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : అమ్మ పాలు పుట్టిన బిడ్డకు అమృతం లాంటివని, పుట్టిన బిడ్డకు తల్లి ముర్రపాలు పట్టిస్తే చిన్నారులలో వచ్చే డయేరియా, కడుపునొప్పి ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి ముర్రపాలు కాపాడుతుందని ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు విజయరాణి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యవేక్షకురాలు విజయ రాణి మాట్లాడారు. బిడ్డకు పాలిచ్చే ముందు తల్లులు బిడ్డపైనే తన మనసును ఉంచాలన్నారు. బిడ్డకు తల్లిపాలు ఇచ్చే ముందు తమ పొట్ట బాగాన బిడ్డను పాలు



డిచ్‌పల్లి : సుద్దులంలో వారోత్సవాల్లో భాగంగా అవగాహన..

పట్టించినట్లయితే తల్లి స్పర్శ బిడ్డకు తగులుతుందన్నారు. చిన్నపిల్లల పట్ల బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలపై, మహిళా గర్భిణీలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో పాటు సూపర్‌వైజర్లు, స్టాఫ్‌నర్స్ సుమలత, ఎంఎల్‌ఎచ్‌పి శైలజ, వైద్య ఆరోగ్య సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని సేవాలాల్ తండా అంగన్వాడీ టీచర్, బోధన్ డివిజన్ యూనియన్ అధ్యక్షురాలు మంగ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రెండవ రోజు అంగన్వాడీ సెంటర్‌లో పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రంలోని ఒకటి నాలుగవ అంగన్వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీ బాలింత మహిళలకు అవగాహన కల్పించినట్టు ఐసిడిఎస్ సూపర్వైజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, సుజాత, సురేఖ, పద్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : మండలంలోని సుద్దులం గ్రామంలో అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగనవాడి టీచర్లు పాల్గొని మాట్లాడుతూ.. బిడ్డపుట్టిన వెంటనే బిడ్డకు పాలు ఇవ్వాలని, మొదటగా వచ్చే ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి ఉంటుందని వివరించారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి, బిడ్డకు అనుబంధం పెరుగుతుందని తెలిపారు. 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని పేర్కొన్నారు. ఇదే కాకుండా బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి రక్తస్రావం తగ్గుతుందని, గర్భసంచి యథాస్థితికి వస్తుందని తెలిపారు. రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై, తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు రాధిక, ఆసియా మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గవర్నమెంట్ హాస్పటల్‌లో, ప్రైవేట్ హాస్పిటల్‌లో డెలివరీ అయిన తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్‌లో గర్భిణీ నార్మల్ డెలివరీ అవ్వడంతో మొదటిగా వచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమని తెలుపుతూ బిడ్డకు పాలు పట్టించినట్లు తెలిపారు. బిడ్డ ఎదుగుదలకు ముర్రుపాలు పునాది అని పేర్కొన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, బిడ్డ బ్రెయిన్ ఎదుగుదలకు చాలా బాగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ గంగవేణి, సౌజన్య, అంగన్వాడీ టీచర్స్ శ్యామల, లక్ష్మి, పుష్ప, జమున, స్వరూప, డాక్టర్ సారిక పాల్గొన్నారు.

ఆర్మూర్ : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో, మండలంలోని మగ్గిడి గ్రామ అంగన్వాడి సెంటర్‌లో బాలింతలకు గర్భవతులకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఇన్చార్జ్ సిడిపిఓ జ్యోతి మాట్లాడుతూ.. తల్లిపాలే ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమైనవని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిప్రి సెక్టార్ సూపర్వైజర్ వెంకట రమణమ్మ, నలిని, టీచర్లు పుష్ప, గంగామణి పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి: తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



వర్నిలో...

అవయవదానంపై అవగాహనా ర్యాలీ

నవతెలంగాణ-బోధన్

ఆగస్టు 3న జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం తెలంగాణ శరీర అవయవదాతల సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జూనియర్ కాలేజీ నుంచి విద్యా వికాస్ కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యావికాస్ కాలేజీ విద్యార్థులకు తెలంగాణ శరీర అవయవ దాన సంఘం అధ్యక్షురాలు డాక్టర్ కాట్రగడ్డ భారతి అవగాహన కల్పించారు. అవయవదాన ప్రాధాన్యత అవయవదానం చేయాల్సిన అవసరం ఎప్పుడు చేస్తారు ఎలా చేస్తారు అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. శరీర దానం ప్రాధాన్యతను కూడా వివరించారు. ఎవరైతే బ్రెయిన్ డెత్ అయి అవయవాలను దానం చేస్తారో



మాట్లాడుతున్న సంఘం సభ్యులు

ఆ వ్యక్తి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని కోరారు. ఆ వ్యక్తి కుటుంబాన్ని జాతీయ పండుగలప్పుడు కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించాలన్నారు. అవయవ దాత కుటుంబంలో ఒక వ్యక్తికి ప్రభుత్వం ఉపాధి కల్పించాలని, అలాగే శరీర దానం చేసిన వ్యక్తి దేహాన్ని అన్ని ప్రభుత్వ కళాశాలలో 24 గంటలు స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పద్మా మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కాట్రగడ్డ భారతి ఆధ్వర్యంలో అవయవ దానంపై చేస్తున్న కృషిని కొనియాడారు. వీరి ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో గతంలోనే తాను అవయవదానం చేసినట్లుగా గుర్తు చేశారు. అంతేగాక సమాజ సేవలో భాగంగా నిత్యం ఈ అంశాన్ని లయన్స్‌క్లబ్‌ల సహకారంతో ముందుకు తీసుకెళ్తూ అందరిని భాగస్వామ్యం చేయడం ప్రశంసనీయమన్నారు. అందరూ అవయవదానానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యావికాస్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్, చక్రవర్తి, పల్లంపాటి శ్రీధర్, శ్యాంసుందర్ పహాడే, మంజులవాణి, శ్రీలక్ష్మి, వాణి, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం తక్షణమే అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ జరిగే ఆందోళనలు జయప్రదం చేయాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ పిలుపునిచ్చారు. పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లీలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం తక్షణమే అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నా, నిరసన ప్రదర్శనలు చేయాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. అర్హులైన వారందరికీ తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలిచ్చి, ఇల్లు కట్టుకోవడానికి 10లక్షల రూపాయలు ఇవ్వాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారెంటీలను సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రేపటి నుంచి తహసిల్దార్ కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు చేస్తామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధానకార్యదర్శి కే.గణేష్, ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు బి.లింగం, టి.విఠల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుఢీకొని పారిశుధ్య కార్మికురాలికి గాయాలు

నవతెలంగాణ-ఎడపల్లి

బస్సుఢీకొని పారిశుధ్య కార్మికురాలికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జానకంపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు ఎంబ లక్ష్మికి బస్సు ఢీకొట్టడంతో కాలుకు గాయాలైనట్టు ఎంబా శ్రీనివాస్ ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం రోడ్డు ఊడవటానికి జనకంపేట్ చౌరస్తా వద్దకు వెళ్ళగా.. అక్కడ రోడ్డు ఊడ్చే సమయంలో బస్సు అజాగ్రత్తగా నడపడంతో ఆమెకు బస్సు ఢీకొట్టడంతో కాలికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

5 నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

మండల ప్రత్యేకాధికారి రంజిత్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి/భీంగల్

గ్రామ పంచాయతీల్లో ఈ నెల 05 నుంచి 09 వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగానే రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రంజిత్‌రెడ్డి, ఎంపిడిఓ అనంత్‌రావు సూచించారు. శుక్రవారం ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సెక్రెటరీ తెలంగాణ ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొదించడం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడానికి 05 నుండి 09 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు. అందుకోసం ప్రతిరోజూ పల్లె ప్రాంతాలలో క్రమపద్ధతిలో పరిశుభ్రత చేపట్టుటకు, గృహస్థాయి, కమ్యూనిటీ స్థాయిలో మొక్కలు నాటడం, ఈ సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలు నిరంతర ప్రాతిపదికన ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రంజిత్‌రెడ్డి

సూచనలు జారీ చేశారన్నారు. 5న స్వచ్ఛదనం పచ్చదనం స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలు, గ్రామ పంచాయతీ కమిటీతో సమావేశం నిర్వహించి, ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఎంపిఓ రాజ్‌కాంత్ రావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం పచ్చదనంలో అందరిని భాగస్వాములు చేయాలి..

భీంగల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలని మండల ప్రత్యేక అధికారి విష్ణువర్ధన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం భీంగల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పచ్చదనం పెంపొందించుటకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుండి 9 వరకు నిర్వహించే పచ్చదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో యువకులు, సమాజ సేవకులు, ప్రజలను భాగస్వాములు చేసి మొదటిరోజు ర్యాలీ నిర్వహించి ప్రజలకు పారిశుధ్యం, తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించి పచ్చదనం వల్ల కలిగే లాభాలను తెలియజేయాలన్నారు. రెండవ రోజు ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేసి నీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. మూడవరోజు మురుగు కాలువలను శుభ్రం చేయించాలన్నారు. నాలుగవ రోజు అంగన్వాడి కేంద్రాలను, ఐదవ రోజు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాలను చేపట్టాలని ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏపీ నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు

పంచాయతీ సెక్రటరీ లేక ఇబ్బందులు

నవతెలంగాణ-ముప్కాల్



ముప్కాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ లేకపోవడంతో గ్రామంలో పనులు ముందుకు సాగడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పనిచేసే పంచాయతీ సెక్రటరీ పలు ఆరోపణలతో సస్పెన్షన్ గురయ్యారు. జూన్ నెలలో సస్పెన్షన్ గురైన సెక్రటరీ స్థానంలో ఇంఛార్జి పాలన సాగుతోంది. మేజర్ పంచాయతీ కావడంతో పనులు అనేకంగా వుంటాయని, పనులు నెమ్మదించడంతో అభివృద్ధి కుంటపడుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రెంజర్ల పంచాయతీ సెక్రటరీకి ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ముప్కాల్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఆగస్టు 03, 2024 | www.navatelangana.com

5 నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

నవతెలంగాణ-ముప్కాల్

'స్వచ్ఛదనం-పచ్ఛదనం' కార్యక్రమం ఈ నెల 5వ తేది నుంచి 9వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పలు అంశాలపై వివిధ కార్యక్రమాలు చేపట్టాలని శుక్రవారం మండల అభివృద్ధి అధికారి మహమ్మద్ ముజాఫరోద్దీన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. శనివారం ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమంపై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్, మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్థక శాఖ, వ్యవసాయ శాఖ, ప్రాజెక్టు అధికారి, ఐకేపీ అధికారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, అడిషనల్ ప్రాజెక్టు అధికారులు సమావేశంలో పాల్గొనాలని సూచించారు.

30 ఏండ్ల పోరాట ఫలితం.. సుప్రీం తీర్పు

నవతెలంగాణ-విలేకరుల బృందం

జక్రాన్‌పల్లి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై గురువారం సుప్రీంకోర్టులో వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల మాదిగలు హర్షం వ్యక్తం చేస్తూ మహిళలు, సంఘం పెద్దలు డప్పులతో ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. ఈ పోరాటంలో తొర్లికొండ గ్రామం క్రియాశీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంకెపల్లి రాములు, మేకల కైలాస్, కనక రాజేశ్వర్, సంకేపల్లి సాయిలు, కనక గంగారాం, కనక రాజేష్ కన్నా, సంకేపల్లె ప్రేమ్, వేల్పుల సుమన్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : ఎస్సీ వర్గీకరణ కేసుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని, అధర్మంపై మాదిగల 30 సంవత్సరాల న్యాయబద్ధమైన పోరాటం గెలిచినందుకు మాదిగల మహాత్ముడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం మాక్లూర్ అంబేద్కర్ చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పునిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు దర్గాల సాయిలు, కాంటం రమేష్, భారీకుంట పోశెట్టి, బాడుగుణ సాయిలు, సరికేల శంకర్, పెద్ద గంగాధర్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై వెలువరించిన తీర్పును స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తూ సాలూర గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ నుంచి డప్పులతో ర్యాలీగా తరలివెళ్లి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



బోధన్ : సంబురాలు చేసుకుంటున్న నాయకులు

రెంజల్ : గత 30 సంవత్సరాల ఉద్యమం నేడు ఫలించి ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీగారి భూమయ్య అన్నారు. మండలంలోని బోర్గం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, అన్న బహు సాటి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

ఎడపల్లి : అత్యున్నత న్యాయస్థానం సానుకూల తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పిల్లనగ్రోవి సావిత్రి అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

డిచ్‌పల్లి : సుప్రీంకోర్టు తీర్పునకు సంతోషంతో మాదిగ కులస్తులకు న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం బి గ్రామంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రెండవ వార్డులో ఫ్రైడే డ్రై డే

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రతి శుక్రవారం ఫ్రైడే -డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని రెండవ వార్డులో న్యాయవాది, మున్సిపల్ కౌన్సిలర్ సంగీతా ఖాందేష్ వడ్డెర కాలనీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తూ, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నిలువ ఉన్న నీరు ద్వారా దోమలు ఏవిధంగా పెరుగుతాయో తెలిపి, పలు చోట్ల నిలువ వున్న వృథానీటిని పారేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, వైద్యఆరోగ్య శాఖా అధికారులు, హెల్త్ అసిస్టెంట్లు స్వప్న, శ్యామల, సౌందర్య, మున్సిపల్ సిబ్బంది శంకర్, మహిళా సమాఖ్య సభ్యులు వేముల సాయమ్మ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భాగస్వామ్యంతోనే గ్రామీణ అభివృద్ధి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మహిళలు భాగస్వామ్యులుగా ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కమ్మర్‌పల్లి తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో మండల మహిళా సమాఖ్య వార్షిక మహాజన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజ శ్రీనివాస్ మహిళా సమాఖ్య మహాజన సభను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వాలు అందించే పథకాలు ప్రతి ఒక్క కుటుంబానికి చేరాలన్న, గ్రామాల్లో ప్రభుత్వాలు చేపట్టే నూతన కార్యక్రమాలు అమలు కావాలన్నా మహిళా సంఘాల భాగస్వామ్యం ఉంటేనే సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ఏపిఎం కుంట గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళా శక్తి పేరుతో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళా శక్తి ద్వారా నూతన వ్యాపారాల ఏర్పాటుకు రుణాలు అందించడం, ఉన్న వ్యాపారాల అభివృద్ధికి, అన్ని రకాల ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజా రాణి, సిబ్బంది రవికుమార్, శ్రీనివాస్ నవీన్, భాగ్యలక్ష్మి, పీరియా, అలేఖ్య, అనసూయ, ధనలక్ష్మి 14 గ్రామాల నుంచి విచ్చేసిన 29 గ్రామ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మండల మహిళా సమైక్య నూతన కార్యవర్గం..

కమ్మర్‌పల్లి మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం శుక్రవారం నిర్వహించిన వార్షిక మహాజన సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సమైక్య నూతన అధ్యక్షురాలుగా రోజారాణి, ఉపాధ్యక్షురాలుగా ఏ. రాధ, కార్యదర్శిగా ఎం.వాసవి, సహాయ కార్యదర్శిగా పి.మౌనిక, కోశాధికారిగా ఎం.కమల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపిఎం కుంట గంగారెడ్డి తెలిపారు.

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శ్రమదానం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గల శివారులో గల రైల్వే బ్రిడ్జి వద్ద గల గుంతలను పూడ్చడానికి తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ అధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అడివి మామిడిపల్లి గ్రామంలో రైల్వే పనులు నత్త నడకన నడుస్తున్నాయని మండిపడ్డారు. నత్త నడకన నడుస్తున్న రైల్వే బ్రిడ్జి పనుల కారణంగా బ్రిడ్జి పక్కన దారి అధ్వాన్న స్థితిలో ఉందని, పలుమార్లు వాహన దారులు కిందపడ్డా పట్టించుకునే నాథుడే లేడని తెలిపారు. బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ కోట గోపాల్‌రెడ్డి, పార్లమెంట్ కమిటీ సభ్యులు హనుమంతరావు, పావులూరు వెంకటేశ్వరరావు, జ్యోతి నారాయణ, నిజామాబాద్ అర్బన్ అధ్యక్షులు అంబిక సత్యనారాయణ, బోధన్ పట్టణ అధ్యక్షులు భాస్కర్, బిజినెస్ సెల్ అధ్యక్షులు బొబ్బ నరసింహారావు, బీసీ సెల్ అధ్యక్షులు దంతాల ఆనంద్, తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు సచిన్ పటేల్, పసుల రాజు, మాక్లూర్ మండల అధ్యక్షులు సత్యనారాయణ, సీనియర్ నాయకులు వీర చారి, పోతాని సత్యం, సాయిబాబా, మల్లేష్, శ్రీనివాస్, ఇప్పాలపల్లి విష్ణు, ఫెరోస్ శ్రీకాంత్ గౌడ్, శ్రీధర్, సాగర్, రాజేశ్వర్, స్వామి, బాలాజీ గౌడ్, లక్ష్మి యాదవ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కెపాసిటర్ బిగింపు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని రైతులకు విద్యుత్ ఆదాచేసే కెపాసిటర్‌ను నిజామాబాద్ డివిజన్ డీఈఎం శ్రీనివాస్ శుక్రవారం అమర్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ ఆదాచేసే కెపాసిటర్ అమర్చుకోవడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్, మోటార్ బోరుపై లోడ్ పడదని తెలిపారు. ఐఎస్ఐ మోటార్ పెట్టుకోవాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు వహించాలని, ప్లాస్టిక్ వస్తువులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎం అశోక్ ఏఈ గోపి, సబ్ ఇంజనీర్ జాన్సన్, ఎస్‌సి లైన్‌మెన్ గోపినాయక్, లైన్‌మెన్ నాగ భూషణం, పవన్, గ్రామ కమిటీ అధ్యక్షులు నరేందర్, నడపి గంగాధర్, కుమ్మరి గంగాధర్, నారాయణ, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు

యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్ అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన నగర సీఐ నరహరి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని నాలుగవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద గల బడాబజార్ యూనియన్ బ్యాంక్‌లో పనిచేసిన బ్యాంక్ మేనేజర్ పినపాటి అజయ్ కుమార్ కొంతమంది కస్టమర్లను నమ్మించి వారికి లోన్లు ఇప్పించి వారి వద్ద సుమారు మూడు కోట్ల డబ్బులు వసూలు చేసి అట్టి డబ్బులను ఆన్లైన్ ట్రేడింగ్ పెట్టి ఖాతాదారులను మోసం చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ విషయంలో నిందితుడిని అరెస్టు చేసినట్టు నిజామాబాద్ నగర సిఐ నరహరి శుక్రవారం తెలిపారు. అంతేకాకుండా కొంతమంది ఖాతాదారుల వద్ద షూరిటీ నిమిత్తం చెక్కులను పెట్టించుకుని ఖాతాదారులకు తెలియకుండా వారి చెక్కులను వినియోగించుకొని ఖాతాదారుల అకౌంట్ల నుంచి డబ్బులు తీసుకున్నాడని తెలిపారు. పుల్లూరి రాకేష్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. నిందితుడిని గురువారం సాయంత్రం నిజామాబాద్‌లోని రైల్వే స్టేషన్‌లో పినపాటి అజయ్‌ను పట్టుకొని విచారించి కోర్టులో హాజరు పరిచినట్లు నగర సీఐ నరహరి తెలియజేశారు.

జీఓ.29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు నష్టం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యుఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవో నెంబర్ 29 పత్రాలను యుఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ కాలనీలో గల అంబేద్కర్ సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే విగ్రహాల ఎదుట శుక్రవారం దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాల జీవో నెంబర్ 29 పత్రాలను దాహనం చేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల విషయంలో గతంలో జీవో నెంబర్ 55 అమలులో ఉండేదన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన నూతన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవో నెంబరు 55ను రద్దు చేస్తూ దాని స్థానంలో 29 జీవోను తీసుకువచ్చిందని తెలిపారు. 29 జీవో ప్రకారం రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఉదాహరణకు ఒక ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించి ఎంపిక విషయంలో మొత్తం ఉద్యోగాల్లో 50 శాతం ఉద్యోగాలకు మెరిట్ ప్రాతిపదికన ఓపెన్ క్యాటగిరిలోకి సెలెక్ట్ చేయగా మిగతా 50 శాతం ఉద్యోగాలకు రిజర్వేషన్లు అమలు చేస్తారని, అయితే జీవో నెంబర్ 29 ప్రకారం మొదట మెరిట్ ప్రకారం ఎంపికైన 50శాతం మందిలో ఎస్సీ ఎస్టీ బీసీల అభ్యర్థులు ఎవరైనా ఉన్నట్లయితే వారి సంఖ్యను పరిగణలోకి తీసుకొని మిగతా 50 శాతంలో రిజర్వేషన్లు కోతలు విధిస్తారని తెలిపారు. దీని కారణంగా అర్హులైన బడుగు బలహీన వర్గాల అభ్యర్థులకు ఉద్యోగాలు రాబోవని వివరించారు. కావున ఈ నష్టానికి ప్రధాన కారణమవుతున్న జీవో నెంబర్ 29ని వెంటనే రద్దుచేసి యధావిధిగా జీవో నెంబర్ 55ను అమల్లోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధాల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మారుతి, సందీప్, జిల్లా సహాయ కార్యదర్శి వేణుగోపాల్, జవహర్‌సింగ్, నాయకులు నిఖిల్ పాల్గొన్నారు.



జీవో నకలు పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

సుదర్శన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

కంఠేశ్వర్ : మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఏర్గట్ల : మాజీ మంత్రి ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఏర్గట్ల మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, నాయకులు రేండ్ల రాజారెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, బద్దం లింగారెడ్డి, దండేవోయిన సాయి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు.

బోధన్ : శాసనసభ్యులు, మాజీమంత్రి పి.సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

ఆర్మూర్ : నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నట్టు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి అన్నారు.

మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం బోధన్, సాలుర మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలురా మండల కేంద్రంలో నాయకులు అన్నదానం నిర్వహించి, ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఖాజాపూర్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఖాజాపూర్ అశోక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కేజీ గంగారం, ఇల్తెపు రమేష్, అల్లె రమేష్, రాహుల్ లక్ష్మణ్, చీల శంకర్, స్వామి గౌడ్, సొక్కం రవి, గాండ్ల రాజేశ్వర్, సరిడే సాయిలు , రాజ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



బోధన్ మండలంలో..

బోధన్ పట్టణంలో..

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా బోధన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ చౌరస్తా వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కార్యకర్తలకు అన్నదనం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, కౌన్సిలర్ శరత్ రెడ్డి, నాయకులు గంగ శంకర్ ,పాషా మహిమద్దీన్, కలీం, దాము, నాగేశ్వరరావు, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఉదయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో పేదలకు పండ్లను పంపిణీ చేశారు.

బాగేపల్లి గ్రామంలో చిన్నారులకు కేక్ పంపిణీ

రెంజల్ : మండలంలోని బాగేపల్లి గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఆగంటి సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో చిన్నారులకు కేక్ పంపిణీ చేశారు. బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని చిన్నారులకు కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ నరేందర్, గ్రామ పెద్దలు ఆగంటి సాయిబాబా గౌడ్, సుభాష్ గౌడ్, మహేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ని ని యోజక వర్గ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శరెడ్డి జన్మదిన సందర్భంగా కుర్నాపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

కంఠేశ్వర్ : మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ నందు కేక్ కట్ చేసి సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

రెంజల్ : బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని రెంజల్ మండల కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మోపాల్ : మండల కేంద్రంలో శుక్రవారం కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోపాల్ మండలాధ్యక్షుడు సాయారెడ్డి, శేఖర్‌గౌడ్, బాడ్సి సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, అనిత, ప్రతాప్, జలంధర్‌రెడ్డి, బున్నే రవి, మోహన్ నాయక్, గోరకంటి లింగన్న, కిరణ్‌రావు, సతీష్‌రావు, బోర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ నాయకులు

కంఠేశ్వర్ : బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హంధాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, జిల్లా డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, సిరికొండ గంగారెడ్డి సుదర్శన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బాల్కొండ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

ఎడపల్లి : మండలంలోని అయా గ్రామాలలో బోధన్ నియోజకవర్గం శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.


మంగల్‌పాడులో..

మండలంలోని మంగళ్ పహాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి జన్మదిన సందర్భంగా బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన పార్టీ నాయకులు తాజా మాజీ ఉపసర్పంచ్ ఇంటర్ శ్రీనివాస్, తాటి సంతోష్ గౌడ్, చేపూరి శ్రీనివాస్‌గౌడ్, పెంట సాయి కుమార్, రంగడి రాములు, రాందాస్ విష్ణువర్ధన్ గౌడ్, గ్రామ యువకులు. నాయకులు తదితరులు పాల్గొన్నారు..

భీంగల్ : మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.



ఎడపల్లి : కుర్నాపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మోపాల్ : పండ్లను పంపిణీ చేస్తున్న ముప్ప గంగారెడ్డి